జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్


epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 19-06-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 49 పేజీలు: 4 వెల : రూ.7




# సిరిమానోత్సవంలో.. అపశృతి

* జారిపడిన సిరిమాను పీట * కింద ఉన్న ఇద్దరు మృతి, ఒకరికి గాయాలు * కుప్పిలి, బుడగట్లపాలెంలో విషాద ఛాయలు








ఎచ్చెర్ల, జూన్ 18 (వార్త): ఎచ్చెర్ల మండలం కుప్పిలిలోని అసిరితల్లి సిరిమాను సంబరంలో అపశ్రుతి చోటుచేసుకుంది. సిరిమానుకు చెందిన సీల ఊడిపోవడంతో.. సిరిమానును అధిరోహించిన వ్యక్తి కింద పడి గాయపడ్డారు. ఈ క్రమంలో సిరిమాను రథాన్ని మోస్తున్న ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. వివరాల్లోకి వెళితే.. కుప్పిలిలో గ్రామదేవత అసిరితల్లి పండగను 14ఏళ్ల తర్వాత గ్రామస్థులు నిర్వహిస్తున్నారు. గత నెల 18 నుంచి వేడుకలు ప్రారంభమయ్యాయి. మంగళవారం సాయంత్రం సిరిమాను రథం గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. బుడగట్లపాలెం గ్రామస్థులు సిరిమాను రథాన్ని ముందుకు లాగుతుండగా.. ఒక్కసారిగా సిరిమాను పైనున్న సీల జారిపడింది. దీంతో సిరిమానును అధిరోహించిన నాయన చిన్నప్పడు సిరిమానుతో పాటు కిందకు పడ్డారు. రథం లాగుతున్న బుడగట్లపాలెనికి చెందిన సూరాడ అప్పన్న(45) అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో వ్యక్తి కారి పల్లేటి(55) తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. సిరిమానుపై కూర్చొన్న నాయన చిన్నప్పడు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడు అప్పన్నకు భార్య సీతమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. మరో మృతుడు పల్లేటికి భార్య చిలకమ్మ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న వెంటనే ఎస్ఐ ఎస్.చిరంజీవి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు హుటాహుటిన కుప్పిలి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రభుత్వపరంగా సాయం అందేలా చూస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట ముప్పిడి సురేష్, పిసినీ జగన్నాథం నాయుడు, రాజపంతుల ప్రకాశరావు, బల్లాడ అరుణ రెడ్డి తదితరులు ఉన్నారు.



## చేపల వలలు దగ్ధం



**సంతబొమ్మాళి, జూన్18(వార్త):** భావన పాడులో టీడీపీ నాయకుడు, మత్స్యకారుడు గొరకుల ఆదినారాయణకు చెందిన రెండు చేపల వలలను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి కాల్చివేశారని నౌపడ పోలీసులకు బాధితుడు మంగళవారం ఫిర్యాదు చేశారు. దీని విలువ సుమారు రూ.15లక్షలు పైగా ఉంటుందని అంచనా వేశారు. నష్టపోయిన తనకు ప్రభుత్వం ఆదుకుని న్యాయం చేయాలని బాధితుడు వేడుకున్నారు.

## మహిళపై ఆరుగురు దాడి

**ఎచ్చెర్ల, జూన్18 (వార్త):** అక్రమ సంబంధం పెట్టుకుందన్న అనుమానంతో ఓ మహిళపై మరో ఆరుగురు మహిళలు దాడి చేసిన ఘటన కుశాలపురం పంచాయతీలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం నగరంలోని దమ్మల వీధికి చెందిన భవానీతో పాటు మరో ఐదుగురు మహిళలు కుశాలపురం పంచాయతీ నవభారత్ ప్రాంతానికి చెందిన ఓ మహిళను ఇంటి నుంచి బయటకు తీసుకువచ్చి ఆమె కంటిలో కారం కొట్టి చితగ్గొట్టారు. భవానీ భర్తకు ఈ మహిళతో అక్రమ సంబంధం ఉందన్న అనుమానంతో ఈ దుశ్చర్యకు పాల్పడింది. దాడిలో తీవ్రంగా గాయపడిన మంగ అపస్మారక స్థితికి చేరుకుంది. దాడి చేసిన మహిళలే శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రిలో మంగను చేర్చారు. బాధితురాలు ఇచ్చిన స్టేట్‌మెంట్‌పై ఔట్‌పోస్టు పోలీసులు ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. బాధితురాలు నవభారత్‌కు చెందిన మహిళ కావటంతో ఎచ్చెర్ల పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆరుగురు మహిళలపై దాడి కేసు నమోదు చేశారు.

## బంగారం స్వాధీనం

**సోంపేట, జూన్ 18 (వార్త):** బారువ గ్రామానికి చెందిన సీపాన రోహిణమ్మ ఈ నెల 17న బారువ నుంచి సోంపేట వస్తుండగా 5 తులాల బంగారం, 1240 ఆస్ట్రేలియా డాలర్లతో ఉన్న బ్యాగును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. సోమవారం రాత్రి సోంపేట పోలీసులకు రోహిణమ్మ ఫిర్యాదు చేసింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆటోలో ప్రయాణించిన వారిని గుర్తు పట్టి వారి నుంచి బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నారు. చోరీకి పాల్పడిన వారు గజపతినగరానికి చెందిన వారుగా గుర్తించినట్లు ఎస్ఐ బి.హైమావతి తెలిపారు.

# జిల్లా అభివృద్ధికి పాటుపడాలి

* లోపాలు సరిచేసుకొని ముందుకుసాగండి
* తప్పు చేస్తే తప్పక శిక్ష తప్పదు
* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు
* ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రజల కోసం పనిచేయండి
* కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు
* పలు శాఖల అధికారులపై మంత్రుల ఆగ్రహం
* హాట్‌హాట్‌గా జడ్పీలో సమావేశం




**శ్రీకాకుళం, జూన్ 18 (వార్త):** ప్రజా ప్రతినిధులు, అధికారులు సమష్టిగా పని చేయాలి.. ఏవైనా లోపాలుంటే సరి చేసుకోని ముందుకు సాగాలి.. జిల్లా అభివృద్ధికి పాటు పడాలి.. అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. ప్రజానీకానికి ప్రభుత్వం సేవలు సమర్థవంతంగా అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశంలో కేంద్ర పౌర విమానయాన శాఖా మాత్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక మత్స్య శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు సంయుక్తంగా జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ కార్యాలయాలకు పనిపై వచ్చిన ప్రతీ ఒక్కరికి కూర్చోబెట్టి వారికి కావలసిన పని పూర్తి చేసి పంపాలని సూచించారు. ప్రతీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కారం మండల స్థాయి వరకూ పూర్తి స్థాయిలో నిర్వహించాలని తద్వారా సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. అలాగే సంబంధిత అధికారులు తప్పక ఆయా చోట్ల హాజరు కావాలన్నారు. జిల్లాలో పారిశుధ్యం బాగు పడాలని, పంచాయతీ, మునిసిపల్ కార్యాలయాలు రానున్న ఒక్క వారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పూర్తి స్థాయిలో మెరుగుపరచాలన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలనీ, పత్రికల్లో వీటిపై కథనాలు వస్తె సంబంధిత అధికారులపై చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. వంశధార పూర్తి చేయాలని, చివరి పంట కాలువ వరకు నీరు అందేలా జంగిల్ క్లియరెన్స్ ఇప్పటి నుంచే చేపట్టాలన్నారు. జిల్లాలో లిఫ్ట్ ఇరిగేషన్‌లో ట్రాన్స్ఫార్మర్లలో సిల్వర్ దొంగతనానికి గురి అయిందని, దొంగతనం చేసిన వారిపై తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. తప్పు చేస్తే తప్పక శిక్ష అనుభవించాలన్నారు. రానున్న ఖరీఫ్ నాటికి లిఫ్ట్ ఇరిగేషన్ అందుబాటులో ఉండాలన్నారు. అలాగే మొక్కలు నాటే కార్యక్రమం పై అటవీశాఖ అధికారులతో మాట్లాడుతూ ఏర్పాట్లపై ప్రత్యేక ద్రుష్టి సారించాలన్నారు. జిల్లాలో 194 కిలోమీటర్లు సముద్ర తీరం ఉందని ఆశాఖ తనదేనని, ఎవరికి ఏటివంటి సమస్యలు ఉన్న ఫోన్‌లో సంప్రదించవచ్చని వాటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కేంద్రంలో మన జిల్లాలో మన వ్యక్తి మంత్రిగా ఉండడం మనకి శుభపరిణామమని ఎంపీ రామ్మోహన్ నాయుడును ప్రత్యేకంగా అభినందించారు. కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపొందిన శాసన సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసారు. ప్రపంచంలో మనదేశంలో ఎన్నికల నిర్వహణపై చాలా గొప్పగా కొనియాడుతారన్నారు. అభివృద్ధి, సంక్షేమ కావాలని లక్ష్యంతో ప్రజలు ఓటు వేసి గెలిపించారని ఇందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష, మామిడి గోవిందరావు, ఎన్.ఈశ్వరరావు, గొండు శంకర్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి. ఎస్పీ జీఆర్ రాధిక, మునిసిపల్ కమిషనర్ తమిమ్ అన్సారియా, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, జిల్లాలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆదాయాభివృద్ధిపై దృష్టి సారించండి



**ఆమదాలవలస, జూన్ 18 (వార్త):** స్వయంశక్తి సంఘాలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలతో వ్యాపారం చేసి ఆదాయాన్ని పెంచుకోవాలని ఆమదాలవలస వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మంగళవారం తులగాం ఆర్ఆర్ కాలనీలో సర్పంచ్ సొండి దమయంతి ఆధ్వర్యంలో స్వయం శక్తి సంఘాతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు గ్రామంలో ఉన్న మహిళా సంఘాలు ఆమదాలవలస బ్యాంకులో ఖాతాలు ప్రారంభించుకోవాలని సూచించారు. మండల పరిధిలోని సంఘాలను బలోపేతం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీటీసీ బండి ప్రభావతి, గొర్ల రాఘవదాసు, నారాయణ దాసు, కృష్ణమూర్తి, క్లస్టర్ కోఆర్డినేటర్ రామప్పడు, వీఓ రేవతి, గ్రామ సంఘం అధ్యక్షురాలు లంక చిన్నమ్మి, స్వయం శక్తి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమాన్ని జగన్ విస్మరించారు

*** మీడియాని నిర్మూలించాలనుకోవడం చారిత్రక తప్పిదం * చంద్రబాబు హయాంలో జర్నలిస్టుల సంక్షేమంపై ఆశలు * ఐజేయూ కార్యవర్గ సభ్యుడు నల్లి ధర్మారావు**




**పలాస, జూన్18(వార్త):** ప్రభుత్వాలు మారినా మీడియా తన బాధ్యతని నిర్వహిస్తూ సజీవంగా ఉం టుందని ఐజేయు కార్యవర్గ సభ్యుడు నల్లి ధర్మారావు అన్నారు. అధికార గర్వం, అహంకార ధోరణితో మీడియాని తనకు అనుకూలంగా మలుచుకోవాలని, లేకుంటే నిర్మూలించాలని భావించడం చారిత్రక తప్పి దమని తెలిపారు. మంగళవారం పలాస-కాశీబుగ్గ ప్రెస్‌క్లబ్ ప్రాంతీయ సమావేశంలో ఆయన మాట్లా డారు. నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన నేప థ్యంలో, జర్నలిస్టుల పాత్ర, వారి సంక్షేమ పట్ల ప్రభు త్వానికి ఉన్న బాధ్యత అనే అంశాలపై నిర్వహించిన సమావేశంలో ధర్మారావు మాట్లాడారు. సలహాదారుల పేరుతో జగన్‌ను మీడియాకు కొందరు దూరం చేశారని విమర్శించారు. నవరత్నాల మేనిఫెస్టోలో జర్నలిస్టుకి ఇళ్ల స్థలాలు అనే అంశం ప్రస్తావించారే తప్ప ఒక్కరికి కూడా ఇళ్లు ఇవ్వలేదన్నారు. అక్రిడేషన్ పాలసీకి సంబంధించి కమిటీలను ఏర్పాటు చేశారే తప్ప జర్నలిస్టులకు కనీసం న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏమైనా జర్నలిస్టులకు జరిగితే, సంక్షేమం అనేది చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ప్రతీకార రాజకీయాల్లో భాగంగా, జర్నలిస్టులపై దాడులు జరిగితే నడిరోడ్డు మీదకు వచ్చి తమ నిరసన తెలియజేస్తామని, అవసరమైతే ఉద్యమాల కూడా చేస్తామన్నారు. ఈనెల 25న విజయవాడలో ఇదే అంశాలపై రాష్ట్ర యూనియన్ కార్యవర్గం సమావేశం ఉందని చెప్పారు. సమావేశంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్. ఈశ్వరరావు, సామ్నా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంవీ మల్లేశ్వరరావు, పలాస- కాశీబుగ్గ ప్రెస్ క్లబ్ ప్రతినిధి జగదీష్, ఏపియుడబ్లుజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతాడ అప్పలనాయుడు, మహారాణా, సామ్నా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిరిగిరి నవచైతన్య, చౌదరి సత్యనారా యణ, జగదీష్ రామారావు, శ్రీరామమూర్తి, బెండి నర్సింగరావు, జర్నలిస్టులు పాల్గొన్నారు.



## 'పలాస'కు సాగు, తాగునీటిని అందించండి

**జడ్పీ సమావేశంలో మంత్రులను కోరిన ఎమ్మెల్యే శిరీష**

**పలాస, జూన్ 18(వార్త):** పలాస నియోజకవర్గం ప్రజలకు సాగు, తాగు నీరు అందేలా చర్యలు తీసువాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. మంగళవారం శ్రీకాకుళం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో పలాస ఎమ్మెల్యే పాల్గొని నియోజకవర్గ సమస్యలను ఏకరువు పెట్టారు. గత నాలుగేళ్లుగా వంశధార శివారు భూములకు సాగునీరు అందక ఇక్కడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ ఖరీఫ్ సీజన్లో వంశధార నీటిని అందించేలా చూడాలని కోరారు. అలాగే రైతులకు సకాలంలో మేలు రకం వరి విత్తనాలు పంపిణీ చేయాలన్నారు. ఇంటింటికి కులాయి ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని వీధుల్లో గోతులు తవ్వి వదిలేశారని, యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కట్టిన ఇళ్ల లబ్ధిదారులకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ఇప్పించేలా కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలోని గిరిజన ప్రాంత రహదారులను ఐటీడీఏ నిధులతో నిర్మాణం చేపట్టాలని శిరీష రాష్ట్ర వ్యవసాయ మంత్రిని కోరారు.



## భక్తుల దాహార్తిని తీర్చడం ఆనందదాయకం

**లైన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షుడు పొన్నాడ రవి కుమార్**

**శ్రీకాకుళం టౌన్, జూన్18 (వార్త):** భక్తుల దాహార్తిని తీర్చటం ఆనందదాయకమని లైన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షుడు పొన్నాడ రవి కుమార్ అన్నారు. స్థానిక కలెక్టర్ బంగ్లా దారిలో గల సాయిగిరి బాబా ఆలయానికి లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ తరుపున భక్తుల సౌకర్యం కోసం ప్యూరిటీ కూలింగ్ ఫ్రిడ్జ్ ను వితరణ చేశారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ సాయి గిరి దేవస్థానానికి భక్తుల తాకిడి అధికమైందని, వారిని దృష్టిలో ఉంచుకొని, వారి సౌకర్యార్థం దేవస్థానం సభ్యులు గుత్తు చిన్నారావుకు అందజేశామని తెలిపారు. భక్తులకు ఈ విధంగా సేవ చేసే భాగ్యం కలిగినందుకు ఆనందంగా ఉందని, క్లబ్ అధ్యక్షులు పొన్నాడ రవి కుమార్ తోపాటు సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మెంబర్ నటుకుల మోహన్, జోన్ ఛైర్పర్సన్ బి. దేవ భూషణమ్, వైస్ ప్రెసిడెంట్ డి. విష్ణు మూర్తి, సభ్యులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, జోగి భారతి, ఉమా కవి, పొడుగు చరణ్, సాయిగిరి దేవస్థానం సభ్యులు గుత్తు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# జంట పట్టణాల్లో కల్తీ ఆహారం విక్రయం

*** హెూటళ్లలో నాణ్యత పాటించని వైనం * రోగాల బారిన ప్రజలు * పట్టించుకోని ఫుడ్ ఇన్స్పెక్టర్**



**పలాస, జూన్18(వార్త):** పలాస కాశీబుగ్గలో కొన్ని హెూటల్‌ళ్లలో కల్తీ ఆహారం విక్రయిస్తున్నారు. నిల్వ ఉంచిన, నాసిరకం వంటకాలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. నాలుగైదు రోజుల పాటు నిల్వ ఉంచిన మటన్, చికెన్ వంటకాలను డీ ఫ్రిజ్‌లో ఉంచి మరలా తిరిగి వేడి చేసి మసాలా దట్టించి భోజన ప్రియులకు అమ్మకాలు చేస్తున్నారు. ప్రతి హెూటళ్లలో తయారు చేసే వంటకాలను, వాటి నాణ్యతను పరిశీలించాల్సిన ఫుడ్ ఇన్స్పెక్టర్ జాడ లేదన్న విమర్శలు ఉన్నాయి. హెూటళ్లలో నిబంధనలు పాటించడం లేదని, తాగేందుకు మినరల్ వాటర్‌ను ఇవ్వడం లేదు. దీంతో భోజనప్రియులు హెూటళ్లలో వాటర్ బాటిల్స్‌ను కొనుగోలు చేసుకుంటున్నారు. పలాస వాణిజ్య కేంద్రం కావడంతో చుట్టుపక్కల గ్రామస్థులు వస్తుంటారు. రైల్వేస్టేషన్ కూడా ఉండడంతో ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడికి రాకపోకలు చేస్తుంటారు. జంట పట్టణాల్లో చిన్నా పెద్దా కలిపి సుమారు 100 వరకూ హెూటళ్లు ఉన్నాయి. హెూటళ్లలో శుభ్రత కూడా పాటించడం లేదు. ఇకనైనా సంబంధిత అధికారులు హెూటళ్లలో ఆహారం నాణ్యతపై తనిఖీలు ముమ్మరం చేయాలని పలాస-కాశీబుగ్గ జంట పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## మత్స్యకారుల భరోసా.. అందని ద్రాక్షేనా?



**వజ్రపుకొత్తూరు, జూన్ 18 (వార్త):** వేట విరామం సమయంలో మత్స్య కారులకు అందించే మత్స్యకారుల భరోసా అరకొరగా మంజూరు పట్ల గంగ పుత్రులు ఆందోళన చెందుతున్నారు. వజ్రపుకొత్తూరు మండలం హుకుంపేట, మంచినీళ్లపేట, కంబాల రాయుడుపేట, కొత్తపేట, డోకులపాడు, నువ్వలరేవు, దేవునల్తాడ, దిబ్బవానిపేట గునుపల్లి గ్రామాల మత్స్యకారులు కొంత మందికి మత్స్యకార భరోసా అందలేదు. దీంతో వారంతా గుబులు చెందుతున్నారు. గత ప్రభుత్వం మత్స్యకారుల భరోసా కింద ప్రతి ఒక్క మత్స్యకారుడికి పదివేలు ఇచ్చేది. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలో దీన్ని ఇరవై వేలుకు పెంచారు. వేటకు వెళ్లే మత్స్యకారుల్లో కొంత మందికి మత్స్యకార భరోసా సొమ్ములు బ్యాంకు అకౌంట్స్‌కు వేసి మరికొంత మందికి పడలేదు. మత్స్యశాఖాధికారులు స్పందించి మత్స్య కారులందరికీ భరోసా సొమ్ములు జమ చేసేలా చూడాలని హుకుంపేట మత్స్యకార నాయకులు వంక మోహనరావు, పుక్కళ్ళ చిన్నారావు, మైలపల్లి కోదండరావు మంగళవారం కోరారు.

## దాసాంజనేయునికి ప్రత్యేక పూజలు



**మందస, జూన్ 18 (వార్త):** మందస పట్టణంలోని శ్రీవాసుదేవపెరుమాళ్ ఆలయంలో మంగళవారం దాసాంజనేయునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు సచ్చిదానందపాడి, అనిల్పాండేలు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా ప్రత్యేక అలంకృతునికావించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయంలో యథావిధిగానే కార్యక్రమాలు నిర్వహించినట్టు దాసు కూర్మాచార్యులు చెప్పారు.

## చదువుతోనే పేదరిక నిర్మూలన



**బూర్జ, జూన్ 18 (వార్త):** పేదరిక నిర్మూలను చదువొక్కటే మార్గమని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనెపు రామకృష్ణం నాయుడు అన్నారు. పెద్దపేట మండల ప్రజాపరిషత్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు పుస్తకా లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం చదువుకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. ఎవరైనా పేద విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బంది పడుతున్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని, వారికి తాను చదివించే బాధ్యతను తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో కడగల కృష్ణ, గేదెల లక్ష్మునాయుడు, దుప్పాడ వెంకటప్పలనాయుడు, దూబ బాలకృష్ణ, వావిలా పల్లి నారాయణరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పూడిలంక రోడ్డు
# పూర్తయ్యేదెప్పుడు?



**వజ్రపుకొత్తూరు, జూన్ 18 (వార్త):** మండలంలోని పూడిలంక రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 2018లో పలాస ఎమ్మెల్యేగా ఉన్న గౌతు శివాజీ రూ.1.30కోట్లతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అప్పుడు మంత్రిగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడు ఈ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. అయితే ఈ రోడ్డు పనులు సగం వరకూ జరిగాయి. 2019లో వైసీపీ ప్రభుత్వం రావడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత ఐదేళ్ల పాటు రోడ్డు పనులు ఒక్క అడుగు కూడా ముందుకుసాగలేదు. తుఫాన్లు, వర్షాలు పడినపుడు పూడిలంక గ్రామస్థులు పడిన అవస్థలు వర్ణాతీతం. ఉప్పుటేరులో జయశ్రీ కంపెనీ ఉప్పు పండించేవారు ఆ మడులకు రక్షణ కోసం వేసిన రాతి గట్టునే గ్రామస్థులు కాలి బాటగా చేసుకున్నారు. ఈ గ్రామంలో సుమారు 50 ఇళ్లు ఉన్నాయి. ఖరీదైనా పంట భూములు ఉండటం వల్ల గ్రామాన్ని వదలి బైటకు రాలేని పరిస్థితి గ్రామస్థులది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం ఉన్నందున రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## రిమ్స్ సూపరింటెండెంట్‌గా షకీలా



**శ్రీకాకుళం టౌన్, జూన్ 18(వార్త):** రిమ్స్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ దాసరి షకీలా మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రొఫెసర్‌గా షకీలా వ్యవహరిస్తున్నారు. ఆమెకు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా పూర్తి అదనపు బాధ్యతలను ఆ శాఖ అధికారులు కట్టబెడుతూ ఉత్తర్వులు జారీ చేశారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

**జిల్లా వార్తలు**



## కేంద్ర మంత్రి రామును కలిసిన ఐఐటి డైరెక్టర్ బాలాజీ

**శ్రీకాకుళం టౌన్, న్ 18 (వార్త):** కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుని ఐఐటి డైరెక్టర్ బాలాజీ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఐఐటి నిర్వహణ తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, డీన్ వెల్ఫేర్ గేదెల రవి , ఆర్జీయూకేటీ అధికారులు కేంద్ర మంత్రికి అభినందనలు తెలిపారు.

# ఘనంగా గొండు శంకర్ జన్మదిన వేడుకలు

*** ఎమ్మెల్యే హోదాలో తొలి పుట్టినరోజు * తరలివచ్చిన శ్రేణులు, అభిమానులు * శుభాకాంక్షలు తెలిపిన అధికార, అనధికారులు * టీడీపీ కార్యాలయంలో పండుగ వాతావరణం**

**శ్రీకాకుళం టౌన్ జూన్ 18(వార్త):** జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శాసనసభ్యులు గొండు శంకర్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే హోదాలో తొలి పుట్టినరోజు జరుపుకుంటున్న శంకర్‌ను టీడీపీ శ్రేణులు, అభిమానులు శుభాకాంక్షలతో ముంచెత్తారు. మంగళవారం ఉదయం నుంచే స్వగ్రామం కిష్టప్ప పేటకు పెద్దఎత్తున చేరుకున్న అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేయగా, అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో వేడుకలు జరిగాయి. తొలుత కార్యాలయ ఆవరణలోని స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం నగర, గ్రామీణ, గార మండలాల నుంచి వచ్చిన నాయకులతో కలిసి కేక్ కట్ చేసి అభిమానులతో పంచుకుని సంబరాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా ఆయన ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వెలుగొందాలని ఆకాంక్షిస్తూ వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. కాగా తమ



అభిమాన నేత ఎమ్మెల్యేగా తొలి పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటుండడంతో శ్రేణులు, అభిమానుల్లో ఆనందోత్సాహలు వెలువెత్తాయి. నియోజకవర్గ నలుమూలల నుంచి తరలివచ్చిన వారు గొండు శంకర్‌కు శుభాకాంక్షలు తెలియజేసేందుకు పోటీపడ్డారు. పుష్ప గుచ్చాలు, పూలదండలతో ముంచెత్తారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలోని పలువురు అధికారులు, అనధికారులు ఎమ్మెల్యే గొండు శంకర్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో నగర పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, డివిజన్ ఇంచార్జిలు, గ్రామీణ, గార మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# యువత మహాత్ముని మార్గంలో నడవాలి

*** రాజాం రెడ్ క్రాస్ యూనిట్ ఛైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్ * లక్ష్మీపురం పాఠశాలలో మహాత్ముని విగ్రహం ఏర్పాటు**

**రాజాం, జూన్18 (వార్త):** దేశానికి స్వాతం త్ర్యం తెచ్చిపెట్టిన మహాత్మా గాంధీజి ఆశయాలను యువత కొనసాగించాలని రాజాం రెడ్‌క్రాస్ యూనిట్ ఛైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్ కుమార్ పిలుపు నిచ్చారు. రేగిడి మండలం లక్ష్మీపురం పాఠశా లలో గాంధీ విగ్రహాన్ని కొత్తా సాయి ప్రశాంత్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ బాలలు విద్యార్థి దశ నుంచే క్రమ శిక్షణతో మెలిగి సత్యం, అహింసా సత్యాగ్రహ ఆయు ధాలతో ఉత్తమ పౌరులుగా ఎదగాలని, చదువుకున్న పాఠశాలకు తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని కోరారు. ముందుగా తన తల్లిదండ్రుల ఆశయం మేరకు గాంధీజి విగ్రహాన్ని ఆవిష్కరించడం జరిగిందన్నారు. ఎందరో స్వాతంత్ర్య సమరయోధులకు గాంధీజి పోరా టం స్పూర్తిదాయకంగా నిలిచి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం. వెంకటరమణ తోపాటు కె. రమాదేవి, గౌరినాయుడు, పాఠశాల స్థల దాత కృష్ణారావు తదితరులున్నారు.

## ఉద్దానం నేత 'కిక్కర'ను కలిసిన సచివాలయం సిబ్బంది

**పలాస, జూన్ 18(వార్త):** ఎన్‌డిఎ కూటమి రాష్ట్రములో అధికారం చేపట్టినందుకు ఉద్దానం దేశం నేత కిక్కర ఢిల్లీరావును బొడ్డపాడు గ్రామ పంచాయతీ సచివాలయం సిబ్బంది మంగళవారం తన ఇంటి వద్ద కలిసి అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఢిల్లీ రావు ఇంటికి విచ్చేసి అభినందనలు తెలియజేశారు.





## వైసీపీ నేతలు మోసం చేశారని వాలంటీర్ల ఆవేదన

**బూర్జ, జూన్18 (వార్త):** మండలంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాయమాటలు చెప్పి రాజీనామా చేయించారని వాలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం బూర్జ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం ఆ కార్యాలయంలో ఎంపీపీ కర్నేన దీప, జడ్పిటిసి బెజ్జిపురపు రామారావు సమక్షంలో ఎంపీడీవో రవీంద్రబాబుకు వారి సమస్యలపై రాజీనామా చేసిన వాలంటీర్లు వినతి పత్రాన్ని అందించారు. గత మూడు నెలలుగా వేతనాలను కోల్పోయామన్నారు. రాజీనామాలు చేయడం మాకు ఇష్టం లేకపోయినా వైసిపి నాయకులు మా చేత బలవంతంగా రాజీనామాలు చేయించారని వాపోయారు. ఇటు వేతనాలు అందక అటు ఉద్యోగాలు లేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, వైసిపి నాయకుల మాటలు నమ్మి మేమంతా జీవనోపాధి కోల్పోయామని వారు గగ్గోలు పెట్టారు. మళ్లీ మాకు వాలంటీర్లుగా నియమించి బకాయి వేతనాలు చెల్లించి మా సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

## టీడీపీ హయాంలోనే విద్యకు పెద్దపీట

**ఆమదాలవలస, జూన్ 18 (వార్త):** విద్యకు తెలుగుదేశం ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మండల టిడిపి సీనియర్ నాయకుడు తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. వెదుళ్లవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



కార్యక్రమంలో సనపల డిల్లేశ్వరరావు, నూకరాజు, బత్తుల లక్ష్మణరావు, ప్రధానోపాధ్యాయులు రమణ మూర్తి పాల్గొన్నారు.

## పోరాట ఫలితం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు

**ఆమదాలవలస, జూన్ 18 (వార్త):** పోరాటానికి తగిన ఫలితం దక్కిందని సీనియర్ న్యాయవాది పైడి వరాహ నరసింహులు అన్నారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తానని చెప్పిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రద్దు చేయడం హర్షణీయమని తెలిపారు. ఆమదాలవలస బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ల్యాండ్ టైట్ చట్టం రద్దు కోరుతూ న్యాయవాదులు, ప్రజా సంఘాలు, రైతుల పోరాటం ఫలించిందన్నారు. ఈ చట్టం వల్ల రైతుల్లో అభద్రతాభావం నెలకొందని తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి ప్రభుత్వానికి న్యాయవాదులు ధన్యవాదములు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మి, న్యాయవాదులు తమ్మినేని విద్యాసాగర్, తమ్మినేని అన్నం నాయుడు, సాధు ధనుంజయరావు, జి.ప్రభాకర్ రావు, సనపల ప్రసాదరావు, జి. వెంకటరావు, పలువురు న్యాయవాదులు ఉన్నారు.





## ఆర్‌బీకేలో వరి విత్తనాల పంపిణీ

**శ్రీకాకుళం టౌన్, జూన్ 18 (వార్త):** సింగుపురం-3 ఆర్‌బీకేలో ఎమ్మెల్యే గొండు శంకర్ రైతులకు ఖరీఫ్ వరి పంట సాగు కొరకు వరి విత్తనాల పంపిణీ చేసారు. ఈ మేరకు 80 క్వింటాలు వరి విత్తనాలు రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. వరి పూర్తి ప్యాకెట్ 1194, ప్రభుత్వ సబ్సిడీ 300, రైతు చెల్లించాల్సింది 894రూపాయలు మాత్రమే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ బగ్గ రజినీ, వ్యవసాయ అధికారిని ఎం.ఉషాకుమారి, ఎఇవో నాయుడు, విఎఎ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నార్తులకు ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్




**శ్రీకాకుళం టౌన్, జూన్ 18 (వార్త):** పేదలు, అనాధలు, అభాగ్యులు, అన్నార్తుల ఆకలి తీర్చడమే లక్ష్యంగా ప్రారంభమైన అన్నా క్యాంటీన్ నిర్విఘ్నంగా కొనసాగుతోంది. నేటికీ 426 రోజులుగా నగరంలో రెండు ప్రాంతాల్లో అన్న క్యాంటీన్ నిర్వహిస్తూ గొండు శంకర్ తన మానవత్వాన్ని చాటుకుంటున్నారు. ప్రభుత్వ అన్నా కాంటీన్లు మూతపడిన అనంతరం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా నగరంలోని ఏడు రోడ్ల కూడలి, పాత బస్టాండ్ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్ ద్వారా నిత్యం వందలాది మందికి భోజనాలు అందజేస్తున్న విషయం తెలిసిందే. అమ్మ చేతి వంటలా, ప్రతీ రోజు కడుపు నిండా అన్నం పెడుతున్న అన్న క్యాంటీన్ నిర్వహణ పట్ల గొండు శంకర్‌ను అన్ని వర్గాల వారు కొనియాడుతూ వస్తున్నారు.

## మంత్రులను కలిసిన ఎస్పీ



**శ్రీకాకుళం టౌన్, జూన్ 18 (వార్త):** శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కేంద్ర పౌర విమానయాన శాఖా మాత్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడుని, రాష్ట్ర వ్యవసాయ, ఉద్యాన,పశుసంవర్ధక మత్స్య శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడుని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక మంగళవారం మర్యాద పూర్వకంగా కలుసుకొని పుష్ప గుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ పాల్గొన్నారు.

## వరి విత్తనాలు పంపిణీ



**బూర్జ, జూన్ 18 (వార్త):** కొల్లివలస రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు మంగళవారం సంబంధిత శాఖ సిబ్బంది చేతుల మీదుగా వరి విత్తనాలను పంపిణీ చేశారు. రైతుల పంట భూములకు అనుగుణంగా వారికి అవసరమైన విత్తనాలను ప్రభుత్వం సకాలంలో అందించింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జీడి వేణు, తెలుగుదేశం పార్టీ నాయకులు సైరిగాపు ఆనందరావు, నూనుగొప్పల వాసుదేవ రావు, నూనగొప్పల శంకర్నారాయణ, మేడి ప్రసాదరావు, మామిడి అప్పల నాయుడు, రైతులు పాల్గొన్నారు.


జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక





## కేంద్ర మంత్రి రామును కలిసిన మాదారపు డేవిడ్

**శ్రీకాకుళం టౌన్, జూన్ 18 (వార్త):** కేంద్ర పౌర విమానయాన శాఖ మాత్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడుని మంగళవారం శ్రీకాకుళంలో కేంద్ర మంత్రివర్యులు స్వగృహంలో శ్రీకాకుళం జిల్లా ఎన్టీఆర్ మోక్షజ్ఞ సేవా సంఘం, ఎన్టీఆర్ ఎంఎస్ఎస్ అధ్యక్షుడు, శ్రీకాకుళం నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్, ఎన్టీఆర్ మోక్షజ్ఞ సేవా సంఘం అధ్యక్షులు మాదారపు డేవిడ్, టీం మెంబర్స్ ప్రదీప్, సురేంద్ర, ప్రసాద్, రాజు, మహేష్, ఉదయ్ సతీష్, దిలీప్, జనార్ధన్ కలిశారు.



# అచ్చెన్నా.. ఏందన్నా!!

* ఉద్యోగులూ.. ప్రభుత్వ భాగస్వాములే
* బహిరంగ హెచ్చరికలు మంచివి కాదు
* కూటమి లక్ష్యం.. కక్ష రాజకీయం కాకూడదు
* అచ్చన్న ప్రకటనపై జిల్లాలో దుమారం

**శ్రీకాకుళం టౌన్, జూన్ 18 (వార్త):** మా వాళ్లు పసుపు బిళ్ళ వేసుకొని వస్తారు.. వాళ్ళని కూర్చోబెట్టి టీ ఇచ్చి.. ఏం పని మీద వచ్చారో.. అడిగి తెలుసుకుని.. ఆ పని పూర్తి చేసి గౌరవంగా పంపించండి.. ఇదీ అచ్చెన్న జిల్లాలో అడుగుపెట్టిన వెంటనే పరోక్షంగా జిల్లా అధికారులకు ఆయా చెప్పిన మాట. అంతవరకు బాగానే ఉంది.. కానీ ఈ విషయాన్ని ఉద్యోగులను నొచుకోకుండా చెప్పి ఉంటే ఎంతో బాగుండేది. అసలు కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడానికి కీలకంగా ఉన్నది ముందు నుంచి వాళ్లే. వాళ్లంతా ఇది మా ప్రభుత్వం అని ఎంతో గొప్పగా చెప్పుకుంటున్నప్పుడు మీరిలా అనడం భావ్యమేనా? గత ప్రభుత్వ పాలనలో, పాలకుల అనాలోచిత నిర్ణయాలకు ఎదురు చెప్పని అధికారులు ... నేడు తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడ్డాక ఎన్ని అవమానాలు పడుతున్నారో , రాష్ట్ర ప్రజలందరూ చూస్తున్నారు. ఈ దుస్థితి సాక్షాత్తు గౌరవ ఐఏఎస్ , ఐపీఎస్ లకే నెలకొనడం విచారకరం . ఉద్యోగస్తులు ప్రభుత్వంలో భాగస్వామ్యం అనే విషయాన్ని పాలకులు మరిచిపోతుండడం పరిపాటిగా మారింది. గత ప్రభుత్వంలో వారు చెప్పినట్టు విన్నారు... ఈ ప్రభుత్వంలో మేము చెప్పినట్టు వినండి అనే ధోరణిలో నేటి పాలకుల తీరు ఉన్నట్టు తెలుస్తోంది. పాలకులు తీసుకున్న విధానపరమైన నిర్ణయాలను ప్రజలకు చేరవేసే గౌరవమైన బాధ్యత అధికారులది. పాలకులు తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే వాటిని ఖండించలేని అధికారులు భవిష్యత్తులో బాధితులే అవుతారు. ఎందుకు ఇదంతా చెప్పాల్సి వస్తుంది అంటే...?? కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ మంత్రులుగా బాధ్యతలు తీసుకొని జిల్లాకు సోమవారం విచ్చేసిన అబ్బాయి, బాబాయ్ లకు తెలుగుదేశం శ్రేణులు భారీగా ఆహ్వానం పలికాయి. ఆ జన సందోహం చూసి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు కార్యకర్తల్లో ఊపు తీసుకొచ్చేందుకు పలు వివాదాస్పద ప్రకటనలు చేశారు. విశేషమైన రాజకీయ పాలననుభవం ఉన్న అచ్చం నాయుడు చేసిన ఆ ప్రకటన ఉద్యోగ, రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారాన్ని రేపింది. “తెలుగుదేశం కార్యకర్తలు పసుపు బిళ్ళను పెట్టుకొని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లండి. అక్కడ అధికారులు మీకు కుర్చీ వేసి టీ కాఫీలు ఇచ్చి , మీ పనులు చేసి పెట్టే విధంగా, అధికారులను రేపు సమావేశం పెట్టి లైన్లోకి తీసుకువస్తాను. ఒకరో ఇద్దరో నా మాట వినకపోతే వారికి ఏం జరుగుతుందో మీరంతా చూస్తారు” అంటూ బహిరంగంగా చేసే ప్రకటన ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది ఈ విషయమే ఉద్దానం అందిస్తున్న గ్రౌండ్ రిపోర్ట్...

### నాడు అలా.. నేడు ఇలా..

సార్వత్రిక ఎన్నికలకు ముందు ఉద్యోగస్తుల బ్యాలెట్, సర్వీస్ ఓట్ల కోసం అధికారుల చుట్టూ .. ఇదే అచ్చం నాయుడు తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా



రాష్ట్రంలోని ఉద్యోగ సంఘాల చుట్టూ ప్రదక్షిణ చేశారు. తమకు మద్దతు ఇవ్వాలని రెండు చేతులు జోడించి అభ్యర్థించారు. అధికారులు, కూటమికి మద్దతు తెలుపుతున్నారనే సంకేతాలు ప్రజల్లోకి వెళితే, ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజలు గుర్తిస్తారని విన్నపం చేశారు. తాము అధికారంలోకి వస్తే మీకు జరగాల్సిన మేలు చేసి పెడతామంటూ హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం మాదిరి బెదిరింపు రాజకీయాలు ఉండవని మాటిచ్చారు. మీకు చట్టపరంగా రావాల్సిన అన్ని బకాయిలను విడుదల చేయడమే కాకుండా.. మీ గౌరవానికి ఎటువంటి సమస్య లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. కూటమిగా ఏర్పడ్డ మా పార్టీ కు మద్దతు తెలిపి ప్రభుత్వ ఏర్పాటుకు సహకారం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. మరి నేడో... ఫలితాలు వచ్చి సరిగ్గా మూడు వారాలయింది. అధికారులు ఖబర్దార్ అంటూ సున్నితమైన బహిరంగ హెచ్చరికలు చేస్తున్నారు. మా వాళ్లకు కుర్చీలేసి టీ కాఫీలు ఇవ్వండి అంటూ అవమానపరుస్తున్నారు. ప్రజలకు మేలు చేసే విధంగా పాలకుల తీరు ఉండాలే గాని, వారి పార్టీ కార్యకర్తలకు మేలు చేసే విధంగా ప్రకటనలు చేయడం సరికాదు. ఆయన చెప్పినట్టు చేస్తే రాబోవు ప్రభుత్వం ముందు వీళ్లంతా తల దించుకునే అవకాశం ఉంటుంది. ఆయన చెప్పినట్టే సమావేశం ఏర్పాటు చేసి నాలుగు గోడల మధ్య తమ కార్యకర్తలకు న్యాయం చేయండి అంటూ అధికారులను కోరవచ్చు. అంతేగాని అధికారుల ఆత్మాభిమానం దెబ్బ తినే విధంగా టీ కాఫీలు అందించి పని చేస్తారు లేదంటే నా కోసం వారికి తెలుసు అని హెచ్చరిక చేయడం అధికారులను అవమానపరచడమే అని పలువురు విశ్రాంత ఉద్యోగులు తమను కలిసిన ఉద్దానం ప్రతినిధి వద్ద వాపోయారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మంత్రి మధ్యలో అధికారులు నలిగిపోతారనే అనుమానాన్ని వ్యక్తపరిచారు.

### ఖరీఫ్‌పై దృష్టి పెట్టండి

రాష్ట్రంలో వ్యవసాయ రంగం కుదేలయింది. ఇటువంటి గడ్డు పరిస్థితుల్లో మీకు కీలకమైన , బాధ్యతాయుతమైన వ్యవసాయ శాఖ మంత్రి పదవిని చంద్రబాబు అప్పచెప్పారు. వంశధార నీరు మీ నియోజకవర్గముతో ఆగిపోతుంది. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గం భూములు బీడు బారిపోతున్నాయి. గత సంవత్సరం కరువుతో ఆయా నియోజకవర్గ రైతులు కటకటలాడిపోయారు. జిల్లా అంతా సస్యశ్యామలంగా ఉంటుంటే ఈ రెండు నియోజకవర్గాలు మాత్రం నెర్రెలుగా మారిన భూములను చూసుకోవాల్సి వస్తుంది. ఈ తారతమ్యం భవిష్యత్తుకు మంచిది కాదు. ఇప్పటికే చాలా ఆర్బికేల్లో విత్తనాల కొరత ఉంది. ప్రైవేట్ డీలర్ల నుంచి రైతులు అధిక మొత్తానికి విత్తనాలు కొనుక్కుంటున్నారు. రాబోవు రోజుల్లో ఖరీఫ్ పనులు ప్రారంభమైతే రైతులకు ఎరువుల సమస్య లేకుండా ప్రణాళిక చేయాలని ఈ సందర్భంగా సూచన చేస్తున్నారు. ఈ విషయమై అధికారుల మీద ఒత్తిడి తెచ్చి రైతాంగానికి మేలు చేయాలని సూచిస్తున్నారు. ఉమ్మడిగా ఏర్పడిన ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తుందని నమ్ముతున్నారు గత ప్రభుత్వం మాదిరి రాజకీయ కక్షలతోనే తమ పాలనా కాలాన్ని ముగిస్తారని కోరుకోవట్లేదు. పెద్ద మెజారిటీలతో ఎన్డీఏ కూటమి అభ్యర్థులును ప్రజలు గెలిపించి మీ బాధ్యతను మరింత పెంచారు. దానికి అనుగుణంగా పాలన చూపించండి. నిన్న మీరు చేసిన ప్రకటన అధికారుల ఆత్మస్థైర్యం దెబ్బ తినే విధంగా ఉందని, భవిష్యత్తులో అధికారులకు మద్దతుగా మీ ప్రవర్తన ఉంటుందనే ఆశాభావాన్ని కొన్ని ఉద్యోగ సంఘాలు వ్యక్తపరిచాయి.

### సోషల్ మీడియా హల్‌చల్

క్షణంలోనే ప్రచారంలో దూసుకుపోతున్న సోషల్ మీడియా ఈ ప్రకటనను వేడెక్కించేస్తుంది. తమ ప్రియతమ నేత తమకు అనుకూలంగా ఊగిపోయి చేసే ప్రసంగం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను విపరీతంగా ఉత్తేజపరిచింది. తమ నాయకుడు, మాకు ప్రభుత్వ కార్యాలయాల్లో గౌరవం కలిగించే విధంగా ప్రకటన చేశాడని, బహిరంగంగానే ఉద్యోగస్తులకు దిశా నిర్దేశం చేసాడని ఆనందపడుతున్నారు. ఇంకా మనల్ని ఆపేది ఎవడు అంటూ కాలర్ ఎగరేస్తున్నారు. తమ తమ వ్యక్తిగత పార్టీ గ్రూపుల్లో విపరీతంగా వైరల్ చేస్తున్నారు. అయితే ఇదే వీడియోను ప్రత్యర్థి పార్టీలో తమ తమ గ్రూపుల్లో పోస్ట్ చేసుకుంటూ అచ్చం నాయుడు ప్రసంగాన్ని తప్పుపడుతున్నారు. వినాశకాలే విపరీత బుద్ధులంటూ పోస్టులు పెడుతున్నారు. ఏది ఏమైనా జిల్లాకు వచ్చిన తొలిరోజే అచ్చం నాయుడు అలజడి సృష్టించారు.

# అక్షరాలతో లక్షల వ్యాపారమా?

* కార్పొరేట్ పాఠశాలల వద్ద ఏఐఎస్ఎఫ్ ఆందోళన
* పాఠశాల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్ముతున్న కార్పొరేట్ విద్యాసంస్థలు
* అనుమతులు లేకుండా నడుపుతున్న కార్పొరేట్ విద్యాసంస్థల పైన చర్యలు తీసుకోవాలి
* ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రవి డిమాండ్

**పలాస,జూన్ 18(వార్త):** ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అనుమతులు లేకుండా నడుపుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలపైన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శ్రీ చైతన్య స్కూల్ వద్ద ధర్నా కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రవి మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్ విద్యాసంస్థలు ఇప్పటికే విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్లు క్లోజ్ అని బోర్డులు ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల పేర్లతో ముద్రించిన పుస్తకాలు అమ్మకూడదని నిబంధన ఉన్నప్పటికీ కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలు తుంగలో తొక్కుతూ తరగతికి 11వేల నుంచి 15000 వరకు పుస్తకాలతో వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలో కార్పొరేట్ విద్యాసంస్థలు రెండు మూడు బ్రాంచ్లకు పర్మిషన్ తెచ్చుకొని ఏడు ఎనిమిది బ్రాంచ్లో నడుపుతున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదని పేర్కొన్నారు.. సీబీఎస్సీ పేరుతో అనుమతులు లేకుండా లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారని జిల్లా విద్యాశాఖ అధికారులకు తెలియజేసిన వాటి పైన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలలో వివిధ రకాల కోర్సుల పేర్లతో టెక్నో ఒలంపియాడ్ సి




బ్యాచ్ ఐకాన్ ఐపిఎల్ అంటూ వివిధ రకాల పేర్లు ఏర్పాటు చేసుకొని ఒక్కొక్క కోర్స్ కు ఒక్కొక్క ఫీజుతో లక్షల దోపిడీ చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల పైన అక్రమంగా పాఠ్యపుస్తకాల అమ్ముతున్న విద్యాసంస్థల పైన అనుమతులు లేకుండా సీబీఎస్ఈ పేరుతో నడుపుతున్న కార్పొరేట్ విద్యాసంస్థల పైన చర్యలు తీసుకోకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు..ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు గోరు వాసుదేవరావు,ఏఐఎస్ఎఫ్ పలాస నియోజకవర్గ అధ్యక్షులు పవన్, ఏఐఎస్ఎఫ్ నాయకులు జస్వంత్,జీవన్,సూర్య, ఆదర్శ్, తదితరులు పాల్గొన్నారు.

# కొండెక్కిన టమాటా

* అదేదారిలో ఉల్లి, పప్పు ధరలు
* ఎన్నికలు అవగానే పెరిగిన ధరలు..

**పలాస, జూన్18 (వార్త):** వంటింట్లో బాంబు పేలినట్టు టమాట ఉల్లిపాయలు కొండెక్కి కూర్చున్నాయి. అలా ఎన్నికలు ముగిసేయలేదో ఇలా ధరలు ఆకాశాన్నింటిపోతున్నాయి. ముఖ్యంగా వంటింట్లో బాంబులు పేల్చే విధంగా నిత్యవసర ధరలు కొండెక్కి కూర్చున్నాయి. నిన్నటి వరకు కేజీ 30 రూపాయలు ఉన్న టమాట ప్రస్తుతం 70 రూపాయలు పలుకుతోంది. దీంతో సామాన్యులు టమాటాలు చూసి బాంబులు చూసినట్లు భయపడుతున్నారు. అక్కడ పండించే రైతులు వద్ద తలారి అది తక్కువ ధరకే కొనుగోలు చేసి మార్కెట్లో 70 రూపాయల కేజీ అమ్ముతుండడంతో టమాటా కొనేందుకు వినియోగదారులు వెనకడుగు వేస్తున్నారు. అదే మాదిరిగా ఉల్లిపాయలు కూడా నిన్నటి వరకు 30 రూపాయలు కేజీ ఉండగా ప్రస్తుతం 45 వరకు పలుకుతుంది. అంతేకాకుండా నాణ్యత గల కందిపప్పు ధర కేజీ 250 రూపాయలు మార్కెట్లో అమ్మకాలు చేస్తున్నారు. మధ్యస్థ కందిపప్పు ధర 150 రూపాయలు అమ్ముతున్నారు కేజీ, దీనికి తోడుగా మినపప్పు కూడా తానేమి తగ్గనట్లుగా పైనకి కూర్చుంది. అంతేకాకుండా చింతపండు ధర కూడా కేజీ 120 రూపాయల వరకు వర్తకులు అమ్ముతున్నారు. అంతేకాకుండా నాణ్యత గల బియ్యం ధరలపై నియంత్రణ లేకపోవడం వలన వర్తకులు చెప్పే ధరకే బియ్యం కొనుగోలు చేసే పరిస్థితి నెలకొంది. చివరికి ఉప్పు ధర కూడా టాటా కంపెనీ పేరుతో బీపీ పెంచే విధంగా అమ్మకాలు జరుగుతున్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం ధరలు నియంత్రించే చర్యలు చేపట్టాలని ప్రాంతీయులు కోరుతున్నారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413